క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్

- కలెక్టర్ సంతోష్

గద్వాల, ఫిబ్రవరి 2 : జిల్లా క్రికెట్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా రాణించాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో షేర్ అలీ ప్రిమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలను ఆదివారం కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు తోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో ప్రతిరోజూ శిక్షణ తీసుకోవాలన్నారు. గద్వాల జిల్లాలో ప్రతి భాషంతులైన క్రీడాకారులను వెలికి తీసేందుకు షేర్ అలీ ప్రిమియర్ లీగ్ పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఫిబ్రవరి 2నుంచి 9వ తేదీవరకు జరిగే ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు జట్లు పోటీ పడుతున్నట్లు చెప్పారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా గెలిచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించేందుకు పావురాలను ఆకాశంలోకి ఎగరవేశారు. కలెక్టర్ బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో తాసీల్దార్ మల్లికార్జున, జిల్లా యువజన క్రీడల అధికారి జితేందర్, న్యాయవాది భీంషేన్‌రావు పాల్గొన్నారు.

నూతన చట్టాలతో వేగంగా కేసుల దర్యాప్తు

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 2 : నూతన చట్టాలతో మరింత వేగంగా కేసుల దర్యాప్తు, బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన చట్టాలపై పోలీస్ అధికారులకు, పోలీస్ స్టేషన్ల రైటర్లకు, సీసీటీఎన్ఎస్ రైటర్లకు, కోర్టు డ్యూటీ అధికారులకు, రిసెప్షన్ కానిస్టేబుళ్లకు న్యాయ నిపుణులు రాష్ట్ర లీగల్ అడ్వైజర్ రిటైర్డ్ పీపీ ఈపూరి రాములు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన నూతన చట్టాల అమలులో వనపర్తి జిల్లా పోలీస్ శాఖ సమర్థవంతంగా నూతన చట్టాలను అమలు పరచడం జరుగుతుందన్నారు. నూతన నేర న్యాయ చట్టాలు 2023 ద్వారా దర్యాప్తు వేగవంతంగా చేయడంతోపాటు బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని, అందుకని నూతన చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాల మీద కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు అందరూ సంపూర్ణ పరిజ్ఞానం, అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నూతన చట్టాలపై ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహించామని అయినప్పటికీ న్యాయ నిపుణులతో అవసరమైనప్పుడు ఒరి యేంటే షన్ తరగతులు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. నూతన చట్టాలను ప్రతిఒక్కరూ కుణ్ణంగా నేర్చుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు అమలులో ఉన్న విధానాలను పూర్తిగా నూతన చట్టాలుగా మార్చడం లేదని, ప్రస్తుత సమాజాన్ని, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కేసుల నమోదు తీరు, శిక్షల విధింపు , విచారణ పద్ధతులను వేగవంతం చేయడానికి అవసర మైన మేరకు పలు అంశాలను నూతన నేరన్యాయ చట్టాలలో మార్చడం జరిగిందని, ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, రైటర్స్ నూతన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసే క్రమంలో జాగ్రత్తగా ఉంటూ ఒకటికి రెండుమార్లు విశ్లే షి చుకుంటూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. అనంతరం తెలంగాణ పోలీస్ లీగ్ అడ్వైజర్ ఈపూరి రాములు కొత్త చట్టాలలో వచ్చిన మార్పులను అధికారులకు, సిబ్బంది వివరించడంతో పాటు వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం పోలీస్ లీగల్ అడ్వైజర్ ఈపూరి రాములను ఎస్పీ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంక టేశ్వరావు, బీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐలు కృష్ణ, రాంబాబు, శివకుమార్, నరేశ్, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, స్టేషన్ల రైటర్లు, కోర్టు డ్యూటీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న లీగల్ అడ్వైజర్ రిటైర్డ్ పీపీ ఈపూరి రాములు

జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లావ్యాప్తంగా నెలరో జులపాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రావుల గిరిధర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 28 వరకు అమలులో ఉన్నందున జిల్లా లో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగిం పులు, ధర్నాలు, ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, నిర్వహించడానికి సన్న హాలు చేయరాదన్నారు. అనుమతులు లేకుండా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియాలో అనవసరమైన విషయాలు, రాజకీయ నాయకుల, కుల మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేస్తామని పేర్కొన్నారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లం ఘించినట్లయితే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం శిక్షకు అర్హులవుతారన్నారు. నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వ హిలా చాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు.

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

చింతరేవులలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు, ఫిబ్రవరి 2 : పల్లెల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతరేవులలో మాజీ సర్పంచ్ ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. అంతకు ముందు పెద్ద చింత డేవుల ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవం, బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకార్యలపై ఆరా తీశారు.

కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వర్‌రెడ్డి, పొగుంట ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నాగర్‌దొడ్డి వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ డీ ఆర్ విజయ్‌కుమార్,భగీరథ వంశీ, రాజన్న, ఆలయ చైర్మెన్ గిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉత్తనూరులో అంతర్రాష్ట్ర బాస్కెట్‌బాల్ టోర్నీ

- తరలిరానున్న క్రీడాకారులు
- ఎన్టీఆర్ స్టేడియంలో టోర్నీకి సర్వం సిద్ధం చేసిన ఆలయ కమిటీ

అయిజ, ఫిబ్రవరి 2 : సామాజిక నవ చైతన్యాలకు నాందీగా తెలంగాణ, ఏపీ తెలుగు రాష్ట్రాల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహి స్తున్నారు. ఉత్తనూర్ గ్రామంలోని ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల బాస్కెట్‌బాల్ క్రీడాకారులను ప్రోత్సహించాలనే దృక్పథంతో పోటీలను ఆలయ కమిటీ నిర్వహిస్తోంది. గత ఐదేండ్ల నుంచి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను అట్ట హాసంగా టోర్నమెంట్‌ను నిర్వహి స్తున్నారు. తెలంగాణ రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి నార్మన్ ఇసాక్, ఉత్తనూర్ బాస్కెట్‌బాల్ టోర్నీ కార్యదర్శి కొట్టం నీలి మరెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం నుంచి 6వ తేదీ వరకు పోటీలను నిర్వ హించనున్నారు. ఇందుకోసం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాట్లను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పగలు, రాత్రి వేళల్లో పోటీలను నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. ఉదయం 6 నుంచి 11 గం టల వరకు, సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు పోటీలు నిర్వ హించనున్నారు. ఈ పోటీలకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి పురు షులు, మహిళల జట్లు తరలిరానున్నాయి. గెలుపొందిన జట్లకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందజేయనున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మారుమూల గ్రామమైన ఉత్తనూర్‌లో బాస్కెట్‌బాల్ కోర్టు ను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్స హించాలనే లక్ష్యంతో పులకుర్తి శ్రీనాథ్‌రెడ్డి సహకారంతో దివంగత నేత పులకుర్తి తిరుమల్‌రెడ్డి బాస్కెట్‌బాల్ కోర్టును ఏ ర్పాటు చేశారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన కోచ్‌లు, క్రీడాకారులు ఉత్త నూల్‌కు తరలిరానున్నారు. పోటీలకు తరలివచ్చిన క్రీడాకారులకు చక్కటి వసతి ఏర్పాటు చేశారు. ఈ నెల 6వ తేదీ నగదు, ట్రోఫీలను బాస్కెట్‌బాల్ చాంపియన్ల కు గౌరవ సన్మానాలు చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

అయిజ : అంతర్రాష్ట్ర బాస్కెట్‌బాల్ టోర్నీకి సిద్ధమైన కోర్టు

నేటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు .

ధన్వంతరి వేంకటే శ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి ఈ నెల 6 వరకు గ్రామంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులతో డ్యాన్స్ మాస్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతోపాటు నృత్య కళాకారిణీలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆలయ కమిటీ తెలిపింది.

గుండ్లు సందెరాళ్లు ఎత్తు పోటీలు ..

ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6వ తేదీన అంత ర్రాష్ట్ర సందెరాళ్లు, దొబ్బుడు గుండ్లు, ఇసుక సంచులు, గుబ్బల గుండ్లు ఎత్తు పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.5,116, రెండో బహుమతి రూ.4,116లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి రైతు సంబురాలు

అయిజ, జనవరి 25 : రైతు సంబురాలకు ఉత్తనూర్ గ్రామంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం సిద్ధమైంది. మండలంలోని ఉత్తనూరు గ్రామంలో కొలు వుదీరిన ధన్వంతరి వేంకటే శ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా ఆలయ కమిటీ రైతు సంబురాల్లోఅఖిల భారత ఒంగోలు గోజాతి పశుబల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా నిర్వహిస్తోంది. అందులో భాగంగా సోమవారం నుంచి ఈ నెల 6వతేదీ వరకు జరుగనున్న పశుబల ప్రదర్శన పోటీలకు తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఒంగోలు జాతి వృషభరాజములు తరలిరానున్నాయి. 4విభాగాల్లో పశుబల ప్రదర్శన పోటీలు నిర్వహించను న్నారు. ప్రతి ప్రదర్శనకు ఐదు నగదు బహుమతులు అందజేయనున్నారు. సోమవారం, నాలుగు పళ్ల విభాగం వృషభరాజముల పశుబల ప్రదర్శన, మంగళవారం, ఆరు పళ్ల విభాగం వృషభరాజముల పశుబల ప్రదర్శన, బుధవారం, న్యూకేటగిరీ విభాగం పశుబల ప్రదర్శన, గురువారం సీనియర్స్ విభాగం పశుబల ప్రదర్శన పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. విజేతలకు గెలుపొందిన వృషభరాజముల యజమానులకు ఆలయ కమిటీ నగదు పుర స్కారం అందజేయనున్నట్లు పేర్కొంది.

అయిజ : రైతు సంబురాలకు ముస్తాబైన ఉత్తనూరులోని ఎన్టీఆర్ మినీ స్టేడియం

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మల్దకల్, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 3వ తేదీ సోమవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వ హిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. 2023-24 ఏడాది గానూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై జిల్లా అధికారుల సమక్షంలో బహిరంగా విచారణ చేస్తారన్నారు. ఇప్పటికే అధికారులు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై గ్రామాల్లో విచారణ పూర్తి చేశారన్నారు. అందుకని ఉదయం 10గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి అన్ని గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు, ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్తనూర్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు

అయిజ, ఫిబ్రవరి 2 : ధన్వంతరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉత్తనూర్ గ్రామంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్య, సాంస్కృతిక, భరతనాట్య ప్రదర్శన కార్యక్రమాలు పలు వురిని ఆకట్టుకున్నాయి. శనివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో కుమారి దివ్య ఆధ్వర్యంలో నిర్వ హించిన కూచిపూడి నాణ్యం, భరత నాట్యం, అన్నమయ్య కీర్తనలు, శ్రీనివాస కల్యాణం, రామాయణం వంటి నృత్య రూపంలో ప్రదర్శించిన నాట్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులు, చిన్నారులను బ్రహ్మోత్సవాల మహా దాత పులకుర్తి శ్రీనాథ్‌రెడ్డి, అర్చకులు సత్యనారాయణలు సన్మానించి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చేసిన పనులకు బిల్లులేవీ?

- పెండింగ్‌లో రూ.కోటి యాభైలక్షలు
- ముళ్లపొదల్లో ప్రకృతివనం
- పదవీకాలం పూర్తయినా బిల్లుల మాటే మరిచారు

ముళ్లపొదలతో శాంతినగర్‌లోని ప్రకృతివనం

వడ్డేపల్లి, ఫిబ్రవరి 2 : మున్సిపాలిటీలో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు అయినప్పటికీ ఏడాది నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో బిల్లుల డబ్బులు రావడంలేదని ప్రజాప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు. రూ.కోటి యాభై లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పదో వార్డు తాజా మాజీ కౌన్సిలర్ ధనలక్ష్మి తెలిపారు. డ్రైనేజీలు, కల్వర్టులు, సీసీరోడ్లు, ఇంటిగ్రేడ్ నిర్మాణ పనుల బిల్లులు ఎందుకు రావ డంలే దని అడిగినా ఏతాలు సరైన సమాధానం చెప్పడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

శాంతినగర్‌లోని 10వ వార్డులో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేసినప్పటికీ నేటికీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదని పనులు చేయించిన అధికారులు బిల్లులు మాత్రం ఇప్పించలేకపోయారని మాజీ కౌన్సిలర్ అన్నారు. ప్రకృతి వనం నిధులు రాకపోవడంతో నాటిన చెట్లు ఎండిపోయి, ముళ్లపొదలు మొలిచాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పను లు జరగలేదని గతంలో జరిగిన పనులకు నేటి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే బిల్లులు రావనే భయంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు కావడంలేదని దీంతో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి

- సీపీఎం నేత మండ్ల ఆంజనేయులు

గోపాలపేట, ఫిబ్రవరి 2 : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవే శపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం నేత మండ్ల ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మాట్లాడు తూ..కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ ప్రజా వ్యతి రేకమైనదని, రైతులు, వ్యవసాయ ఉపాధి కార్మికులు అసం ఘటితరంగ కార్మికులకు, పేదలకు విద్యార్థి, యువకులకు ఈ బడ్జెట్ లో అన్యాయం జరిగిందని, నిధుల కేటాయింపులో కోతలు జరిగాయన్నారు. ఆహార భద్రతకు నిధులు తగ్గించారని, ఇది ముమ్మాటికి ప్రజా వ్యతిరేక ప్రభుత్వమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 8మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక కేటాయిం పులు లేకపోవడం బాధాకరమని, కేంద్ర ప్రభుత్వం మరోసారి తెలంగాణ రాష్ట్రానికి ఐఐఎం, ఐఐటీ, సైనిక్ పాఠశాలలు కేంద్ర విద్యా సంస్థలు రావాల్సిఉండగా వాటిని కేటాయించకుండా మరోసారి తెలంగాణ విద్యార్థులపై సవితి తల్లి ప్రేమను చూపించిందన్నారు. అదే విధంగా కార్పొరేట్లకు బడా పెట్టుబడి దారులకు అను గుణంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ వల్ల ఒరిగేది ఏమీ లేదని, తెలంగాణ ప్రాంతంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూయించడం నిర్లక్ష ధోరణికి నిదర్శనమన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాన్‌గల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న పూర్వవిద్యార్థులు.

పాన్‌గల్, ఫిబ్రవరి 2 : మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2009ఏడాదిలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని నాటి జ్ఞాపకాలు, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయు లను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు

ధరూరు, ఫిబ్రవరి 2 : మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై కొండ శ్రీహరి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహన దారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలని , వెంట వాహన ధ్రువపత్రాలు ఉంచుకోవాలని సూచించారు. బైక్ నడిపే వారు హెల్మెట్ ధరించాలని కార్లు నడిపేవారు సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు.

విద్యుత్ స్తంభాలకు ఆన్‌ఆఫ్ స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయాలి

పాన్‌గల్, ఫిబ్రవరి 2: మండలంలోని మాందా పుల్ గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు ఆన్ ఆఫ్ స్విచ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్తంభాలకు ఆన్ ఆఫ్ స్విచ్ బోర్డులు లేకపోవడంతో రాత్రి, పగలు వెలగడం వల్ల విద్యుత్ వృథా అవుతుందని తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత విద్యుత్ అధికారులకు తెలిపినప్పటికీ పట్టిం చుకోవడం లేదని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 2: జిల్లా కేంద్రానికి చెందిన ఫొటో జర్నలిస్టు మహేశ్‌సింగ్ తల్లి విజయలక్ష్మీ బాయి చెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. విషయం తెలు సుకున్న టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు యూనియన్ నాయకులతో కలిసి వారి స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మహేశ్‌సింగ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని, సాను భూతిని వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ యూనియన్ తర ఫున ఫొటో జర్నలిస్ట్ మహేష్‌సింగ్‌కు ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయ్‌కుమార్, అరుణ్ రాజ్, హరీశ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రైతు వేదికకు.. భద్రత కరువు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 2 : రైతు బంధు, రైతు బీమాతో తెలంగాణ రైతులకు అండగా నిలిచిన మాజీ సీఎం కేసీఆర్ మదిలో మెదిలిన మహత్తర ఆలోచన రైతువేదిక. రైతు వేదికలో వ్యవ సాయ అధికారి అందు బాటులో ఉంటూ, నారు పోసిన నాటి నుంచి కోత కోసే వరకూ ప్రతి దశలోనూ రైతులకు సహ కరి స్తారు. రైతులు తమ ఆలోచనలు పంచుకోవడంలో, నూతన సాంకేతికతను అంది పుచ్చుకోవడంలో ఈ వేదికలు ప్రధాన భూమిక పోషిస్తాయి. నాడు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన రైతు వేదికలకు నేడు భద్రత కరువ వుతుంది. దీనికి ఉదాహరణగా మండలంలోని మున్న నూల్ గ్రామంలో ప్రధాన ద్వారం తలు పులు ధ్వంసమై దర్శన మిస్తున్న రైతువేదిక.

మున్ననూర్‌లో ప్రధాన ద్వారం తలుపులు ధ్వంసమై దర్శనమిస్తున్న రైతు వేదిక

మహా ప్రదర్శన పోస్టర్ విడుదల

మల్దకల్, ఫిబ్రవరి 2 : ఫిబ్రవరి 7వ తేదీన హైదరా బాద్‌లో జరిగే లక్షల డప్పులు వేల గొంతులు కార్యక్రమం వాల్ పోస్టర్‌లను ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మోశన్న మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు ఏబీసీడీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగా ముఖ్య అతి థిగా హాజరు కానున్నట్లు తెలిపారు. అందుకని మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన డప్పు కళాకారులు, ఎస్సీ మాదిగ 58 ఉప కులాల ప్రతి సామా జిక వర్గ బిడ్డలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, లక్ష్మన్న , తిమ్మన్న , తిమ్మరాజు,అమృత్, తిమ్మన్న, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

గట్టు, ఫిబ్రవరి 2 : ఈనెల 7వ తేదీన హైదరా బాద్‌లో నిర్వ హించే లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఏసన్న మాదిగ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమం ద్వారా మాదిగలు తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బండారి డేవిడ్ , నాయకులు నర్సింహులు, గోపాల్, ప్రభు, చిన్నన్న, కాశిమన్న, ఈదన్న, బొడ్డన్న, దశరథ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

అయిజ, ఫిబ్రవరి 2 : ఈనెల 7వ తేదీన జరిగే 'లక్ష డప్పులు వేల గొంతులు' వాల్‌పోస్టర్లను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహి స్తుందన్నారు. 7న జరిగే లక్ష డప్పులు వేల గొంతుల సభకు నాయకులు, కార్యకర్తలు, కళాకారులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

గట్టులో పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

మల్దకల్‌లో మహా ప్రదర్శన పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అయిజలో వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు